**జర్నలిస్ట్ కథలు**

# కాంక్రీట్ కవిత్వం

◆ జొన్నలగడ్డ రాధాకృష్ణ ◆

## బ్లాక్ మనీ ఎక్కువైనప్పుడు అది ఒక్కో మనిషిలో ఒక్కో విధంగా బయటికి తన్నుకొస్తుంది.

కొందరిలో దేశభక్తి రూపంలో బయటికొస్తుంది. వీళ్ళు పేద ప్రజల కష్టాల్ని చూసి ఖిన్నులైపోతారు. ప్రజాసేవ చైడానికి ఈ దేశ ప్రధానమంత్రో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రో, కనీస పక్షాన ఎంపీనో ఎమ్మెల్యేనో అయిపోవాలని, వీళ్ళు ఆరాట పడతారు. కొండొకచో అయిపోతారు కూడా.

మరి కొందరిలో దైవభక్తి పేట్రేగిపోతుంది. వీళ్ళు కాంట్రాక్టుల్లో మిగిల్చిన సిమెంటుతో గుళ్లూ గోపురాలూ కట్టించాలనో అధవా ఏదైనా బాగా ఆదాయం వున్న దేవస్థానం బోర్డు చైర్మన్ అవ్వాలనో ఉబలాట పడతారు. కనీసం ఓ దేవాలయానికి ఓ ట్యూబులైటయినా కొని, వెలుతురు బయటికి కనిపించనంత దట్టంగా తమ పేరు, అడ్రస్సూ దాని మీద రాయించుకుంటారు.

బ్లాక్ మనీ ఈ రెండు రకాలుగా ప్రకోపించడం వల్ల దేశానికి ఆటే డేంజరు లేదు. కొంతమందికి ఇది కవితావేశంగా తన్నుకొస్తుంది. బ్లాక్‌మనీ సకల రూపాల్లోకీ ఇదే అత్యంత ప్రమాదకరమైన రూపం. దీని విషయంలో విజ్ఞతగల వారంతా అప్రమత్తంగా వుంటారు. ఎక్కడైనా కవితావేశం తన్నుకొస్తున్న సూచనలు కనిపిస్తే అక్కణ్ణించి గంటకి 80 కిలో మీటర్లకు తగ్గని వేగంతో పారిపోతారు. అయితే ముంచుకొస్తున్న తుఫానుని ముందుగా పసిగట్టడానికి ఉపయోగించే యాత్రాల వంటివాటిని కవితావేశాన్ని గుర్తుపట్టేందుకు థామస్ అల్వా ఎడిసన్ గానీ మరొకరు గానీ కనిపెట్టనందువల్ల ఈ కవితావేశం ఎలాంటి వార్నింగూ లేకుండా విరుచుకు పడుతోంది. పల్లపు ప్రాంతాల్ని ఖాళీ చేయించే టైము కూడా వుండనందువల్ల పెక్కు సందర్భాల్లో బక్క ప్రాణాలు బలైపోవడం కద్దు.

లంబోదరం అని ఓ సుప్రసిద్ధ కాంట్రాక్టరు వున్నాడు. వీడు ఇసకతోటీ, ఒండ్రుమట్టితోటీ అనేక రైల్వే బ్రిడ్జిలు కట్టేసినందువల్ల బ్లాక్ మనీ బీభత్సంగా పోగై కవితావేశ రూపం ధరించి, ఓ శుభోదయాన బొంబే హైలో, కృష్ణా గోదావరి బేసిన్లో గ్యాసు తన్నుకొచ్చినట్టు తన్నుకురాసాగింది. ఇది తెలిసిన విజ్ఞులంతా వాడికీ తమకీ మధ్య కనీసం 60 కిలో మీటర్ల దూరం వుండేలా చూసుకుంటున్నారు.

కానీ ప్రజాగోల సముజ్జ్వల దినపత్రిక ఎడిటర్ త్రయంబకం విజ్ఞుల జాబితాలోకి రాడు.

●●●

**బ్లాక్‌మనీ సకల రూపాల్లోకి అత్యంత ప్రమాదకరమైన రూపం.**

●●●

అంచేత తను కట్టబోయే మూడో ఇంటికి కవిత్వంతోపాటు తగు మాత్రం సిమెంటూ ఇటికలూ వగైరా ఇవ్వకపోడనే ఆశతో ఈ లంబోదరాన్ని టీకీ, కవితా గోష్ఠికీ ఆహ్వానించాడు.

ఇది తెలిసి ప్రజాగోల స్టాఫు గజగజా వొణికిపోయారు.

"రెండు కవి వృషభాల భీషణ సంగ్రామం నేడే- మన ఆఫీసులోనే" అని ప్రకటించాడు ప్రజాగోల స్టార్ రిపోర్టర్ గుర్నాథం పొద్దున్న ఆఫీసుకి రాగానే.

ఒక్క వృషభం దాటికే తల్లకిందులైపోతున్న ఆఫీసు స్టాఫ్‌లో కాజువల్ మెడికల్ తదితర లీవులు సమృద్ధిగా వున్న వాళ్ళంతా తక్షణం వాటిని పెట్టేసి అదృశ్యం అయిపోయారు. మిగిలిన వాళ్ళు మాత్రం ఉరిశిక్ష ఖాయపడిన వాళ్ళలా ఆ శుభఘడియ కోసం ఎదురు చూస్తూ కూచున్నారు.

ఆ శుభఘడియ రానే వొచ్చింది.

లంబోదరం పెద్ద బెంజి కారులో దిగాడు. ఎప్పుడూ వేసే సఫారీ కాకుండా ఇవాళ పంచా, లాల్చీ, కండువా వేశాడు. కాస్త పండితుడిలా కనిపించాలనే సంకల్పంతో బొట్టు కూడా పెట్టాడు.

త్రయంబకం వొచ్చి లంబోదరానికి పూర్ణకుంభంతో స్వాగతం చెప్పాడు. ఇద్దరూ వెళ్ళి త్రయంబకం రూములో కూచోగానే ఆఫీస్ స్టాఫంతా ముందుగా సిద్ధం చేసి వుంచుకున్న దూదిని తమతమ చెవుల్లో దట్టంగా కుక్కేసుకున్నారు. అయినప్పటికీ వినిపిస్తోంది రూములో జరుగుతున్న కవితా బీభత్సం.

## జర్నలిస్ట్ కథలు

# లంబోదరం ముందుగా సరస్వతీ స్తోత్రంతో కవితా గోష్టి మొదలెట్టాడు

గుర్నాధం, వీటన్నిటికీ అతీతుడు. అతగాడ ఫీల్డులో తిరిగే రిపోర్టరు. పొద్దున్న లేచిందగ్గిర్నించీ ముఖ్యమంత్రులూ, మంత్రులూ, ఇతర రాజకీయ జనాభా చెప్పే అబద్ధాలన్నీ వినీ వినీ ఏది విన్నా భయపడని గుండె ధైర్యాన్ని అతను సంతరించుకున్నాడు. మొన్నామధ్య ముఖ్యమంత్రి నిరుద్యోగం నిర్మూలించేస్తాం అన్నప్పుడు గానీ, ఏడాదిలో అందరికీ ఇళ్లు కట్టిస్తాం అన్నప్పుడుగానీ, జంట నగరాల్లో ఇక నీళ్ళకి కొరత వుండదు అన్నప్పుడు గానీ అతను షాక్‌తో మూర్ఛపోలేదు. కనీసం గుండెపోటు కూడా రాలేదు. అంచేత కవుల్ని గానీ. కవిత్వాలని గానీ అతను అస్సలు కేర్ చెయ్యడు. పిరికి వాళ్ళలాగా చెవుల్లో దూది కుక్కుకోడు.

హోంమంత్రి పోలీస్‌స్టేషన్లు పవిత్ర దేవాలయాలనీ, పోలీసులు ప్రజల స్నేహితులనీ స్టేట్‌మెంట్ ఇచ్చినప్పుడు కూడా అతను చెవుల్లో దూది కుక్కుకోలేదు.

లంబోదరం ముందుగా సరస్వతీ స్తోత్రంతో కవితాగోష్టి మొదలెట్టాడు. సాధారణ పరిస్థితులలో అయితే త్రయంబకం మరొహాణ్ణి కవితాగోష్ఠి మొదలెట్టనిచ్చే సమస్యలేదు. కానీ ఇప్పుడ తను కట్టబోయే ఇంటికి సిమెంటూ వగైరాలు వుల్ఫాగా కొట్టేయాల్సిన పవిత్ర కర్తవ్యం గుర్తుకొచ్చి లంబోదరాన్ని మొదలెట్టనిచ్చాడు.

"తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్
బూనితిన్ నీవు నా
యుల్లంబందుననిచ్చి జృంభణముగా..."

అని చదివి ఏం రాశాడండీ వేమన అన్నాడు లంబోదరం తన్మయత్వంతో.

"వేమనే నంటారా దీన్ని రాసింది?" అన్నాడు త్రయంబకం అనుమానంగా.

"భలేవారు సార్ వేమనే. చివరిదాకా చదివితే విశ్వదాభిరామ వినుర వేమ అని వొచ్చేస్తుంది" అని లంబోదరం చివరిదాకా చదివేశాడు గానీ విశ్వదాభిరామ రాలేదు.

"అరే తమాషాగా వుందే ఇంతకు ముందు వొచ్చేది ఈ వధ్య రావటం లేదుగామోను. అయినా సరే వేమన గొప్పవాడే. వుండండి ఆయనదే ఒకటి చదువుతా. అని అప్పిచ్చు వాడు పజ్యం చదివేశాడు. కానీ దాని చివర సుమతీ అని వొచ్చేసింది.

ఆశ్చర్యంతో లంబోదరం కళ్ళు పెద్దవయ్యాయి.

"వుండండి ఎక్కడో పొరపాటు జరిగింది. మరోటి చదువుతా అంటూ "ఏదేశమేగినా..." అని మొదలెట్టాడు ఎంతసేపు చదివినా విశ్వదాభిరామగానీ మరొటి గానీ రావటం లేదు. ఆగిపోయి ఈసారి మా తెలుగు తల్లికి అందుకున్నాడు. దానికీ విశ్వదాభిరామ రాలేదు. "చేర చిరంగిపోగొరుకు చిమ్మట కేమి ఫలంబు భాస్కరా" అని నాలిక్కరిచెనుకున్నాడు.

"ఇవాళ మూడు బావులేదు. కాసిన్ని మంచి నీళ్ళిప్పిస్తారా" అన్నాడు లంబోదరం సిగరెట్టు వెలిగించుకుంటూ.

త్రయంబకానిక్కూడా ఎంత బుర్ర పగలగొట్టుకున్నా సొంత పజ్యాలే గుర్తొస్తున్నాయి. గానీ వేమనివి రావటంలేదు.

"పోనీ ఇంకోళ్ళ గురించెందుకు మన పజ్యాల గురించే మాట్లాడుకుందామా" అన్నాడు ఆశగా.



# జర్నలిస్ట్ కథలు



## సినిమా పేర్లు — వ్యక్తులు

కొన్ని సినిమా పేర్లు కొందరికే పరిమితమా అని అనిపిస్తుంది. 'అందాజ్' పేరు వినగానే కపూర్ కుటుంబంలోని వ్యక్తులు గుర్తుకొస్తారు. రాజ్ కపూర్, షమ్మీకపూర్, ఇప్పుడు అనిల్ కపూర్. అలాగే 'అనాడి' పేరుతో ఎప్పుడు చిత్రం తీసినా కపూర్ కుటుంబంలోని వ్యక్తులే ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. రాజ్ కపూర్, శశికపూర్, ఇప్పుడు కరిష్మాకపూర్... ఆ రెండు పేర్లు వారి కుటుంబాలకే సొంతమా!

"అదెలాగూ వుంది. నా అభిమాన కవి వేమన గాదా. అంచేత ముందు ఆయన గురించి డిస్కస్ చేద్దామని... ఆ గుర్తొచ్చింది" అని పెద్దగా అరిచి ఉపకారికి నుపకారము అంటూ మొదలు పెట్టాడు. దానికీ చివర్న సుమతీ అని వొచ్చేసేసరికి పెద్దగా నిట్టూర్చి వెనక్కి చేరపడ్డాడు లంబోదరం.

"పోనీ ఉప్పు కప్పురంబు ట్రై చెయ్యండి సార్" అన్నాడు మంచి నీళ్ళివ్వడానికి లోపలికొచ్చిన ఆఫీస్ బోయ్ రామయ్య.

"నీ బొంద. ఇద్దరు మహాకవులం మాకే గుర్తు రావటం లేదు. అనవసరంగా పెద్ద విషయాల్లో తలదూర్చకు" అని వాణ్ణి కసిరేసి, "ఏ వనుకోకండి సార్. వాడో ఫూల్. అన్నిట్లోనూ తలదూరుస్తాడు. ఓ రోజు ఎడిటోరియల్ రాసే అవకాశం ఇమ్మని అడిగాడు" అన్నాడు త్రయంబకం.

"పోన్లెండి చదువుకోని వాళ్ళతో మనకేవిటి, వాణ్ణి క్షమించేద్దాం" అన్నాడు లంబోదరం.

ఇద్దరూ చెరో విశాల హృదయంతో వాణ్ణి క్షమించి పారేశారు. అయినా కవితా చర్చ మాత్రం ముందుకు సాగలేదు. పోనీ సుమతీ శతకంలో పజ్యాలే గుర్తొస్తున్నాయి గనుక అవి రాసిన వాటి గురించే చర్చించుదాం అని త్రయంబకం అంటే లంబోదరం ససేమిరా ఒప్పుకోడం లేదు. వేమనే నా గురువు అంటున్నాడు.

ఇహ వుండబట్టలేక త్రయంబకం తను రాసిన లేటెస్ట్ కవిత్వం చదవ దొడంగాడు. ఆ వెంటనే లంబోదరం కనుబొమ్మలు ముడేసి ముక్కుమీద మిడతవాలిన వాడిలా మొహం పెట్టేసే సరికి సిమెంటూ ఇటికలూ ఇవ్వడేమోననే అనుమానం వొచ్చి సగంలో ఆపేశాడు లంబోదరం స్వీయ కవితా పఠనం.

"మీరు చదవండి సార్. మాదే వుంది అంతా రొటీన్ కవిత్వం" అనేశాడు.

లంబోదరం తల పరికించి సిగరెట్ వెలిగించి ఆలోచనలో పడిపోయాడు.

వున్నట్టుండి మొదలెట్టాడు.

"ఇటికలు అతుకుతాయి
సిమెంట్‌తో"

కాస్త గొంతు పెంచి మళ్ళీ అన్నాడు.

"ఇటికలు అతుకుతాయి
సిమెంట్‌తో
మనసులు కలుస్తాయి
సెంటిమెంట్‌తో"

"వహ్వా వహ్వా వహ్వా ఏం కవిత్వం ఏం ఎక్స్‌ప్రెషన్, ఏం ఒరిజనాలిటీ అంటున్నాడు లంబోదరం.

"కలిసిన మనసులు
కాంక్రీట్ లాంటివి
ఏ శక్తికీ అవి లొంగవు
ఏ సుత్తికీ అవి కుంగవు"

"బాబోయ్, చంపేశారు సార్. ఎంతైతే మాత్రం ఇంత కవిత్వమా. జీవిత సత్యాన్ని ఎంత బాగా చెప్పారు సార్" అన్నాడు త్రయంబకం ఆనంద పారవశ్యంతో.

లంబోదరం మళ్ళీ మళ్ళీ అదే చదువుతున్నాడు. ప్రమాదాన్ని పసిగట్టిన త్రయంబకం "ఈ కవితం ఎందులోనైనా వొచ్చిందా సార్" అన్నాడు.

"లేదు. ఇంకా ఏ పత్రిక్కీ పంపలే. మీరు కావలిస్తే వేసుకోవొచ్చు."

త్రయంబకం వెంటనే స్టెనోని పిలిచి ఆ మహత్తరమైన గేయాన్ని డిక్టేట్ చేసి రేపు ఆదివారం సప్లిమెంట్‌లో ఫస్ట్‌పేజీలో వొచ్చెయ్యాలని ఆదేశాలు జారీ చేసేశాడు.

"మీరు గొప్పవాళ్ళు. మీ పద్యాల్లో కూడా సిమ్మెంటే వుంటుంది. మాలాంటి వాళ్ళకి ఇల్లు కట్టుకోడానిక్కూడా సిమ్మెంట్ దొరికి చావదు" అని నసిగాడు త్రయంబకం.

లంబోదరం గొల్లున నవ్వేశాడు.

"ఏం కంగారు పడకండి సార్. మీ ఇల్లు పూర్తయ్యే దాకా సిమెంటూ, మీ పత్రిక్కి వారం వారం కవిత్వం పంపడం నా డ్యూటీ. చూస్తుండండి ప్రజాగోల సర్క్యులేషన్ ఎలా పెరిగిపోతుందో" అంటున్నాడు లంబోదరం.

ఎన్నో దుర్వార్తలు, ఘోరమైన అబద్ధాలు, పచ్చి మోసపు వాగ్దానాలు విన్న గుర్నాధం కూడా ఇది విని తట్టుకోలేకపోయాడు. అర్జెంట్‌గా అప్పు చేసి అసోకో బార్ దిశగా పరుగు తీశాడు.



## సంచలన చిత్రం

బ్రెజిల్ అధ్యక్షుడు ఫెర్నాండో గారి తమ్ముడు అవినీతి కొకైన్ మొదలగు మాదకద్రవ్యాల వాడకం మీద రకరకాలుగా పత్రికలు విమర్శించాయి. అదేమి పట్టనట్లుగా అతని భార్య 'థెరెజా కాలర్' తన అంద చందాలను ప్రదర్శిస్తూ పత్రికలకు ఫోజులిచ్చింది. ఆమె ముఖ చిత్రాన్ని ప్రచురించిన బ్రెజిల్ పత్రిక 'మాంచేట్' అత్యధిక సర్క్యులేషన్ సాధించింది. ఆ పత్రిక చరిత్రలో రికార్డట!